సాక్షి
నిజామాబాద్

మంగళవారం ׀ 20 ׀ జూన్ ׀ 2023



రైతులకు ఓటీపీ కష్టాలు

రైతులు ధాన్యం అమ్మినా ఓటీపీ రాకపోవడంతో డబ్బులు జమ కావడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



ఊరించి.. ఉసూరుమనిపించి

కాకతీయ కాలువకు నీరు నిలిపివేశారు. పంటలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.8 /29.5

ఉదయం నుంచి ఎండ వేడిమి అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఏసీబీ విచారణ

సౌత్‌క్యాంపస్‌లో పనిచేసిన సిబ్బందిని కలిసిన అధికారి

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేసిన జంగంపల్లికి చెందిన ముగ్గురిని సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారి విచారించారు. ఉదయం జంగంపల్లి గ్రామానికి వచ్చిన ఏసీబీ అధికారి సౌత్‌క్యాంపస్‌లో ఔట్‌సోర్సింగ్‌లో దినసరి కార్మికులుగా పని చేసిన రాహుల్, రమేశ్, రాజులను విచారించారు. వారి ఇళ్లకు వెళ్లి వారు ఉద్యోగం పొందేందుకు ఇచ్చిన డబ్బులు ఎంత.. ఎవరికి ఇచ్చారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగం నుంచి తొలగించడంతో తిరిగి లంచం డబ్బులు వాపస్ ఎవరు ఇచ్చారన్న విషయంపై కూడా సదరు అధికారి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సౌత్ క్యాంపస్‌లో మొత్తం 15 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం లంచం తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారని ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు విచారణ నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేసిన 15 మందిలో 12 మంది జంగంపల్లికి చెందిన వారు కాగా తిప్పాపూర్, బీబీపేట, చిన్నమల్లారెడ్డి గ్రామాలకు చెందిన ఒక్కొక్కరు ఉద్యోగులుగా చేరారు. వీసీ రవీందర్ గుప్తా ఏసీబీకి చిక్కిన నేపథ్యంలో అధికారులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నేడు విద్యా దినోత్సవం

నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో మంగళవారం విద్యాదినోత్సవం నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు జాతీయ జెండావిష్కరణలు, అవార్డుల అందజేత నిర్వహిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు.

డైట్ ఫస్టియర్ ఫలితాల విడుదల

డీఎడ్ ఫస్టియర్ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను www.bsc.telangana.gov.in నందు చూసుకోవాలన్నారు. రీకౌంటింగ్ కోసం అభ్యర్థులు జూలై ఒకటో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డైట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్ : ఈనెల 21 నుంచి డైయిట్‌లో ప్రవేశాలకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్లు డైయిట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 22, 23 తేదీల్లో డీసెట్- 2023 లో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తెలుగు ఉర్దూ ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. నాల్గోతరగతి నుంచి ఇంటర్ వరకు బోనోఫైడ్ పదో తరగతి మెమో, ఇంటర్ మెమో, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు.

తీరు మార్చుకోండి..

- డీఏఓ తిరుమల ప్రసాద్‌కు ఉద్యోగుల అల్టిమేటం



డొంకేశ్వర్(ఆర్మూర్) : తీరు మార్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో)కు ఆ శాఖ ఉద్యోగులు అల్టిమేటం ఇచ్చారు. డీఏవో తీరుపై గుర్రుగా ఉన్న ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు కార్యాలయ ఉద్యోగులు సోమవారం మరోసారి అంతర్గత సమావేశమయ్యారు. కొత్త కలెక్టరేట్‌లోని టీఎన్‌జీవో గదిలో చర్చలు జరిపి డీఏవోకు ఒకసారి అవకాశం ఇచ్చి చూడాలని నిర్ణయానికి వచ్చారు. అక్కడి నుంచి నేరుగా వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరుకున్న ఉద్యోగులు చాంబర్‌లో ఉన్న డీఏవో తిరుమల ప్రసాద్‌ను బయటకు రావాలని కోరారు. అప్పటికే ఉద్యోగుల కోసం కార్యాలయంలో కుర్చీలు ఏర్పాటు చేయగా, డీఏవో వచ్చిన వెంటనే ఉద్యోగులంతా నేలపై కూర్చొని నిరసన తెలిపారు. వారితో పాటే డీఏవో కూడా కింద కూర్చున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనతో చర్చలు జరిపారు. ప్రవర్తన తీరుతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలా మునుపెన్నడూ జరగలేదన్నారు. మనోభావాలను దెబ్బతినేలా దురుసుగా మాట్లాడడం సరికాదని, దీనిని మార్చుకోవాలన్నారు. ఉద్యోగులు చెప్పిన విషయాలపై స్పందించిన డీఏవో... నా మూలంగా ఎవరికైనా ఇబ్బంది కలిగుంటే క్షమించాలని కోరారు. ఎలాంటి అటుపోట్లు, అనుమానాలకు తావు లేకుండా కలిసి పని చేసుకుందామన్నారు. అయినప్పటికీ మీకు ఇబ్బందిగా అనిపిస్తే, వారం, పది రోజుల్లో జిల్లా వ్యవసాయాధికారిగా కొనసాగాలో వద్దో నిర్ణయం తీసకుంటానని ఉద్యోగులతో అన్నారు.

● ఆందోళన



ఖలీల్‌వాడి : రేషన్ షాపుల ద్వారా 12 రకాల వస్తువులను ఉచితంగా ఇవ్వాలని, రూ. 500 వంట గ్యాస్ ను అందించాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కార్యదర్శి గోదావరి మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ షాప్‌ల ద్వారా 12 రకాల వస్తువులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంధ్యా, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

● మారో ధక్కా



నిజామాబాద్ బస్టాండ్‌లో సోమవారం బాన్సువాడ డిపోకు చెందిన బస్సు ఆగిపోయింది. ఇంజిన్‌లో సమస్యతో ఎంతకూ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు దిగి నెట్టారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

● నిలువ నీడ లేక..



జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికి జనాలు పెద్ద ఎత్తున వస్తారు. సోమవారం ప్రజావాణి లేకపోవడంతో ఫిర్యాదులు వేసేందుకు బాక్స్‌ను ఏర్పాటు చేశారు. సౌకర్యాలు లేక పోవడంతో ఓ మహిళ ఇలా కూర్చొని ఫిర్యాదు రాస్తోంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఏ పంట విత్తుకోవాలి!

అయోమయంలో రైతన్నలు

- సోయాబీన్ లేదా మొక్కజొన్న విత్తుకోవడంపై తేల్చుకోలేకపోతున్న కర్షకులు
- వర్షాధార పంటలకు గడ్డుకాలం



ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో సోయాబీన్ విత్తుకోవడానికి సిద్ధం చేసుకున్న క్షేత్రం

ఆర్మూర్ : వర్షాకాలం ప్రారంభ దినమైన మిరుగు దాటి రెండు వారాలు గడుస్తున్నా తొలకరి వర్షాలు ముఖం చాటేయడంతో జిల్లా రైతాంగం సోయాబీన్ లేదా మొక్కజొన్న పంటల్లో ఏ పంట విత్తుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో రైతులకు అందుబాటులో ఉండి సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖ సిబ్బంది జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వేధింపుల కారణంగా క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండలేకపోతున్నామని అంటున్నారు.

మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా సోయాబీన్ పంటను వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించారు. ఈ వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా 58,715 ఎకరాల్లో సోయాబీన్, 32,185 ఎకరాల్లో మొక్కజొన్న పంటను పండించడానికి వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ వాతావరణ పరిస్థితులు అందుకు తగినట్లుగా లేకపోవడంతో రైతులకు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది.

సోయాబీన్ పండించే రైతులు..

వర్షాధార పంట అయిన సోయా పండించడానికి తొలకరి వర్షం కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. తొలకరి వర్షాలు ప్రారంభంతోనే విత్తనాలు విత్తుకోవడానికి రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలను సిద్ధం చేసుకున్నారు. మొక్కజొన్న పంటతో పోలిస్తే కూలీల ఖర్చు తక్కువ కావడమే కాకుండా సాగుకు శ్రమ తక్కువగా ఉంటుంది. మొక్కజొన్న పండించడానికి పడిన శ్రమలో సగం శ్రమిస్తే అదే లాభం ఆర్జించడంతో పాటు వర్షాధార పంట కావడంతో రైతులు సోయాబీన్ పండించడానికి ఆసక్తి చూపుతున్నారు.

మొక్కజొన్న పండించే రైతులు..

మే చివరి వారం రోహిణి నుంచి జూలై 15 వరకు మొక్కజొన్న విత్తవచ్చు. ఇది వర్షాధార పంట. నీటి వసతి ఉన్నవారు సైతం వేయవచ్చు. 120 రోజుల పంట. నీటి వసతి ఉన్న వారు పచ్చి మక్కబుట్ట కోసం ఆర్మూర్ మండలంలో 500 ఎకరాల్లో పండిస్తున్నారు. పచ్చి బుట్ట పంట 90 రోజుల్లో చేతికొస్తుంది. బోరు బావుల్లో నీటి వసతి ఉన్న రైతులు మాత్రం ధైర్యంగా మొక్కజొన్న విత్తుకొని సాగు నీటిని అందిస్తున్నారు. వర్షంపై ఆధారపడ్డ రైతులు మాత్రం ఆకాశం వైపు వర్షం కోసం చూస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

❝ తొలకరి కోసం ఎదురుచూపు..

ప్రతి ఏడాది లాగే సోయాబీ న్ విత్తుకుందామని అనుకున్నాము. కాని తొలకరి సకా లంలో రాకపోవడంతో బో రు బావిలో ఉన్న నీటితో రెండు మడులు మొక్కజొ న్న విత్తాను. మొక్కజొన్నకు కూడా వర్షం కావాల్సిన పరిస్థితి వచ్చింది. ఏం చేయాలో తోచడం లేదు. భూగర్భ జలాలు సైతం ఆశించిన స్థాయిలో లేవు. చేసేది లేక తొలకరి కోసం ఎదురు చూస్తున్నాము.

- చిన్నయ్య, రైతు, (శ్రీరాంపూర్) ఫత్తేపూర్, ఆర్మూర్ మండలం

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య కలకలం

- ఆర్మూర్ ఎస్సీ వసతి గృహంలో ఘటన
- పట్టభద్రురాలిగా వస్తుందనుకుంటే విగత జీవిగా మారింది : తల్లి ఆవేదన



ఆర్మూర్/ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్‌లోని షెడ్యూల్ కులాల వసతి గృహంలో డిగ్రీ విద్యార్థిని బలవన్మరణం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మెండోరా మండల కేంద్రానికి చెందిన గోలి వెంకటరాములు, సత్తెమ్మల రెండో కూతురు రక్షిత (20) వసతి గృహంలో ఉంటూ ఆర్మూర్‌లోని నరేంద్ర మహిళ డిగ్రీ కళాశాలలో డిగ్రీ (ఎంపీసీఎస్) తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి వసతి గృహంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందింది. భోజనాలు చేసి గదికి వచ్చిన తోటి విద్యార్థినులు రక్షిత తలుపులు తీయకపోవడంతో అనుమానంతో కిటికీ లోంచి చూశారు. వెంటనే తలుపులు బద్దలు కొట్టి లోనికెళ్లారు. రక్షితను ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్షిత మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చొరవను పలువురు ప్రశంసించారు. సమాచారంతో తల్లి సత్తమ్మ, మేనమామ రాజేందర్ ఆస్పత్రికి వచ్చారు. మరో రెండ్రోజుల్లో డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూర్తవుతాయి. బిడ్డ పట్టభద్రురాలిగా తిరిగి వస్తుందనుకుంటే.. విగత జీవిగా మారిందని కూతురి మృతదేహాన్ని చూస్తూ తల్లి విలపించడం అందరిని కదిలించింది.

అందరితో కలిసి మెలిసి ఉండేది...

రక్షిత ఆత్మహత్య తోటి విద్యార్థినులను తీవ్రంగా కలిచివేసింది. రక్షిత బలవన్మరణం నమ్మలేక పోతున్నామని హాస్టల్ వార్డెన్ ఫర్జానా బేగం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి భీమయ్య, రాజగంగారాం, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి నర్సయ్య వార్డెన్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు.

మెండోరాలో విషాదం..

బాల్కొండ : రక్షిత ఆత్మహత్యతో ఆమె స్వగ్రామమైన మెండోరాలో విషాద ఛాయాలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఉపాధి కోసం రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లిన మృతురాలి తండ్రి వచ్చాక మంగళవారం రక్షిత అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతురాలికి అక్క ఆకాంక్ష, తమ్ముడు అభిరామ్ ఉన్నారు.



రక్షిత బలవన్మరణంతో ఎస్సీ వసతి గృహంలో విషాదంలో విద్యార్థినులు

10 శాతం మింగేశారు..



పార్కు కోసం వదిలిన ఈ స్థలంలోనే ప్లాట్లు చేసి విక్రయించారు

- పార్కుకు వదిలిన స్థలంలో ప్లాట్లు చేసి విక్రయం
- వెంచర్ నిర్వాహకుడికి సహరించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- జిల్లా కలెక్టర్, అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన కరువు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.. గజం భూమి రూ. వేల నుంచి రూ. లక్షల్లో పలుకుతుంది.. దీంతో చాలామంది వ్యవసాయభూములను వెంచర్‌లుగా మార్చేసి ప్లాట్లు చేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారు. నగరంలోని మానిక్ భండార్ ప్రాంతం ఆర్టీసీ కాలనీ పద్మావతినగర్‌లో రెండు ఎకరాల్లో వెంచర్ వేశారు. భూములకు ధరలకు డిమాండ్ రావడంతో ఇదే అదనుగా పార్కుకు వదిలేసిన 10 శాతం భూమిలోనూ ప్లాట్లు చేసి మరీ సొమ్ముచేసుకున్నారు. ఈ విషయం తెలిసిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పెద్ద ఎత్తున కాసులు దండుకొని వెంచర్ నిర్వాహకుడికి సహకరించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయమై 2018 నుంచి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు రాతపూర్వకంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా స్పందించకపోవడం గమనార్హం.

అక్రమ లేఅవుట్ తయారు చేసి..

మానిక్ భండార్ ప్రాంతంలోని పద్మావతి నగర్‌లో ఓం నారాయణ అట్టల్ అనే వ్యక్తి తనకు సంబంధించిన 2.02 ఎకరాల భూమిలో 2003 సంవత్సరంలో ఎల్‌పీనంబర్ 8/2003/ HRO/ H1లో వెంచర్ వేశారు. నిబంధనల ప్రకారం డీటీసీపీ అనుమతి తీసుకొని 32 ప్లాట్లు చేశారు. ఇందులో 10 శాతం భూమి అనగా సుమారు 1,200 గజాల భూమి పార్కు కోసం కేటాయించాలి. అయితే ఇదే ఎల్‌పీనంబర్‌తో నిజామాబాద్ మున్సిపాలిటీలో అక్రమ లేఅవుట్ తయారు చేయించారు. 10 శాతం భూమిలో 6 ప్లాట్లు చేసి అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. అంతే గాకుండా ఒకే ప్లాట్‌ను ఇద్దరికి అమ్మిన వివాదాలు ఉన్నాయి.

ప్రస్తుతం ఈ ప్రాంతం గజం భూమి విలువ సుమారుగా రూ. 20 వేలకు పైనే ఉంది. పార్కుకు సంబంధించిన స్థలం 1,200 గజాల్లో సుమారు 700 గజాల భూమిని అమ్మేసి సొ మ్ము చేసుకున్నారు. మిగత 500 గజాల భూమికి స్థానికులు, సామాజిక కార్యకర్తలు పట్టుబట్టి మున్సిపల్ అధికారులతో పోరాటాలు చేసి కంచె ఏర్పాటు చేయించారు.

ఫిర్యాదులు.. చెత్తబుట్టలోకే...

వెంచర్ నిర్వాహకుడి అక్రమాలను గుర్తించిన స్థానికులు, మరో సామాజిక కార్యకర్త చంద్రప్రకాష్ మోదానీ నేరుగా 2018 సంవత్సరం నుంచి మాక్లూర్ మండల తహసీల్దార్‌కు, ఆర్‌డీవో, జిల్లా కలెక్టర్‌లకు, మున్సిపల్ కమిషనర్‌లకు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. నాలుగేళ్లు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు చెత్త బుట్టలో వేస్తూనే ఉన్నారు. పైగా ఫిర్యాదు చేసిన వ్యక్తిని వేధింపులను గురిచేయడంతో పాటు భయపెట్టడంతో బాధితుడు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ఈ నెల 9న కూడా జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపాయే..

లిక్కర్ స్కాం కేసు బలపడుతోంది

- ఎమ్మెల్సీ కవిత జైలుకెళ్లడం ఖాయం
- ఎంపీ అర్వింద్ ఆరోపణలు



డొంకేశ్వర్‌లో పార్టీలోకి చేర్చుకుంటున్న అర్వింద్

పెర్కిట్(ఆర్మూర్): లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత జైలుకెళ్లడం ఖాయమని జిల్లా ఎంపీ అర్వింద్ అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నందిపేట మండలం డొంకేశ్వర్, నికాల్పూర్ గ్రామాలకు చెందిన సుమారు 300 మంది కార్యకర్తలు ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ లిక్కర్ స్కాం కేసు ఆలస్యమవుతుందని తెలంగాణ ప్రజలు నిరుత్సాహ పడనవసరం లేదన్నారు. ఎంత ఆలస్యమయితే కేసు అంత బలోపేతం అవుతుందన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని ఎలాగైనా ఓడిస్తామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలను సాగనివ్వమన్నారు. ప్రత్యేక రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ ఏ విషయంలో బాగుపడిందో చెప్పాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అవినీతితో భ్రష్టుపట్టిపోయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడుగు పెట్టే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు కరువయ్యారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో నార్లు వేసుకుని నిరీక్షిస్తున్న రైతులకు వర్షాలు రాక ఇబ్బందులు పడుతుంటే కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీ వరకు రివర్స్ పంపింగ్ ద్వారా సాగు నీరందిస్తామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం చుక్క నీటిని వదలడం లేదన్నారు. మహారాష్ట్ర, కర్నాటకలో డీజిల్, పెట్రోల్‌లో మిలిథం చేసే ఇథనాల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తే.. వరిని విరివిగా సాగు చేసే తెలంగాణలో మాత్రం ఒక్క ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదన్నారు. తెలంగాణలో 17 ఇథనాల్ ఫ్యాక్టరీలు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో వరి ధాన్యం సేకరణకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా తరుగు పేరుతో రూ.12 వందల కోట్ల స్కాం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో అనేక సంక్షేమ పథకాలతో పాటు సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు.

త్వరలో రాబోయే కామన్ సివిల్ కోడ్ ప్రయోజనం వల్ల ముస్లిం మహిళలు సైతం నరేంద్ర మోదీకి మద్దతు పలుకుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె గంగా రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, పాలెపు రాజు, సాయి రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉపసర్పంచ్‌ల నిర్బంధం

లక్కంపల్లి సెజ్ భూములను అమ్ముకుంటున్నారని ఆరోపణ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం లక్కంపల్లి గ్రామ శివారులోని సెజ్ భూములను అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపిస్తూ సోమవారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను గ్రామస్తులు నిర్బంధించారు. వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయ ఆధారిత కేంద్రం (సెజ్) లో రెండు కులసంఘాలకు స్థలాలు ఇచ్చేందుకు గాను భూములను పరిశీలించేందుకు సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో పాటు సర్పంచ్ మూడ సుమలత వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి ఆందోళన చేశారు. గ్రామస్తులకు, పాలకవర్గ సిబ్బందికి తెలియకుండా సర్పంచ్ భర్త మూడ మహేందర్ భూములను అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన చేశారు. అంతేగాకుండా పాలకవర్గానికి, గ్రామస్తులకు తెలియకుండా గ్రామపంచాయతీ తీర్మానం కాపీని ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రాంతం వారికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయనే ఉద్దేశంతో తమ విలువైన భూములను సెజ్‌కు అప్పగించామని ఇప్పుడు తమకు తెలియకుండా భూములను అక్రమంగా అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని మాట్లాడేందుకు గాను గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకున్న గ్రామ సర్పంచ్ మూడ సుమలత, ఉప సర్పంచ్ మాయాపురం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్ కిషన్‌లను గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం గదిలో నిర్బంధించి తాళం వేశారు. సమాచారం అందుకున్న పోలీసులు లక్కంపల్లి గ్రామానికి చేరుకుని గ్రామస్తులు, యువకులతో మాట్లాడి వారిని శాంతిప జేసే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికురులు సమస్యను తేల్చేంత వరకు వీరిని వదిలి పెట్టేది లేదని పోలీసులతో గ్రామస్తులు, యువకులు వాగ్వివాదం చేశారు. ఆందోళన చేసిన వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



లక్కంపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉపసర్పంచ్‌ల నిర్బంధం

క్లుప్తంగా

చెట్లను నరికితే కఠిన చర్యలు



మోర్తాడ్: మండలంలోని దోన్‌పాల్ అటవీ భూముల్లో సోమవారం నిర్వహించిన హరితోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొని మొక్కలు నాటారు. రిజర్వు ఫారెస్టు భూముల్లో మొక్కలను పెంచి అడవిని అభివృద్ధి చేయడం ఎంతో బాగుంటుందన్నారు. రిజర్వు ఫారెస్టులో ఎవరైనా చెట్లను నరికి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో చందర్‌నాయక్, డీసీవో సింహాచలం, డీఎఫ్‌వో వికాస్ మీనా, తహసీల్దార్ బావయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఎఫ్ఆర్‌వో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్



ఖలీల్‌వాడి: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతోంది. సోమవారం 600 మంది అభ్యర్థులకు 529 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అదనపు డీసీపీ(ఏఆర్) గిరిరాజు, పరిపాలన అధికారి శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, మక్బూద్ హైమద్, గోవింద్ పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గూపన్‌పల్లిలోని ఓ ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన ఇందూరు గంగాధర్ తన ఇంట్లో ఏదో గుప్త నిధి ఉందని తవ్వకాలు చేస్తున్నాడని పోలీస్‌లకు సమాచారం అందింది. దీంతో నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు ఓటీపీ కష్టాలు

- ధాన్యం సేకరణ పూర్తి చేసినా రైతుల ఫోన్‌లకు రాని ఓటీపీ
- డబ్బులు జమ చేయడంలో తీవ్ర జాప్యం



మాదాం నర్సయ్య, రైతు, తొర్తి



మోర్తాడ్ నుంచి రైస్‌మిల్లుకు తరలుతున్న ధాన్యం

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన రైతు మాదాం నర్సయ్య నెల రోజుల కింద శెట్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రంలో 118 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాడు. అతనికి రూ.2,43,080 సొమ్ము రావాల్సి ఉంది. ఇప్పటి వరకు సదరు రైతు నర్సయ్య మొబైల్‌కు ఓటీపీ మెస్సెజ్ రాకపోవడంతో ధాన్యం సొమ్ము ఇప్పట్లో జమ అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. వర్షాకాలం పంటలకు పెట్టుబడి ఎలా పెట్టాలనే సందిగ్ధంలో ఉన్న రైతు నర్సయ్యకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి ఎలాంటి సమాధానం లేదు. ఇది ఒక్క రైతు నర్సయ్యకు ఎదురైన సమస్యనే కాదు. ఎంతో మంది వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు కలుగుతున్న కష్టాలు. ఓటీపీ మొబైల్ ఫోన్‌కు వచ్చిన నాలుగైదు రోజుల్లోనే ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతుంది. జిల్లాలో యాసంగి సీజనుకు సంబంధించిన ధాన్యం సేకరణ పూర్తి చేసినా రైతులను ఓటీపీ కష్టాలు వెంటాడుతుండటంతో ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో 459 కొనుగోలు కేంద్రాల ద్వారా 6.45 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యంను సేకరించారు. దాదాపు 200 లారీల ధాన్యానికి సంబంధించి రైతులకు ఓటీపీ జనరేట్ కావడం లేదు. యాసంగి పంటలకు సంబంధించి క్రాప్‌బుకింగ్ సరిగా పూర్తి చేయకపోవడం, కొనుగోలు కేంద్రాల నుంచి తరలించే ధాన్యం ఏ మిల్లుకు తరలించాలో అలాట్‌మెంట్ జరగకపోవడంతో ఓటీపీ రావడం లేదని తెలుస్తుంది. రోజుల తరబడి ధాన్యం డబ్బులు కోసం రైతులు నిరీక్షించడానికి ఓటీపీ ప్రధాన సమస్య అని వెల్లడైతుంది. యాసంగిలో సాగు చేసిన పంటలను ఏఈఓలు క్రాప్‌బుకింగ్ పూర్తి చేశారు. కొన్ని చోట్ల రైతు సాగు చేసిన విస్తీర్ణానికి నమోదైన ఎకరాలకు తేడా ఉండటంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం లెక్క, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీలు పడటం లేదు. కమ్మర్‌పల్లి సహకార సంఘం పరిధిలో క్రాప్ బుకింగ్‌లో అనేక తప్పులు దొర్లడంతో రైతులకు ఓటీపీ జనరేట్ చేయడం ఇబ్బందిగా మారింది. చివరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవసాయాధికారులతో సంప్రదింపులు జరిపి క్రాప్ బుకింగ్‌ను సరి చేయాల్సి వస్తుంది. పంటలను సాగు చేసిన సమయంలోనే క్రాప్ బుకింగ్ పక్కాగా చేసి ఉంటే సమస్య వచ్చేది కాదని రైతులు అంటున్నారు.

ఫిర్యాదుల కోసం బాక్సు ఏర్పాటు



బాక్సులో ఫిర్యాదులు వేస్తున్న ప్రజలు



కలెక్టరేట్‌కు వచ్చిన డొంకేశ్వర్ గ్రామస్తులు

సుభాష్‌నగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయినా పలువురు అర్జీలు తీసుకొని కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో అధికారులు ఫిర్యాదుదారుల కోసం కలెక్టరేట్ గేట్ ఎదుట ప్రత్యేకంగా బాక్సు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు తమ వినతులను ఆ బాక్సులో వేశారు.

దారి ఇవ్వకుండా ఇబ్బందులు..

డొంకేశ్వర్ మండలకేంద్రంలో దారి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ గుద్దేటి హరిదాస్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలో 50 కుటుంబాలు వెళ్లేందుకు దారి ఉందని, ఆ రోడ్డులో సర్పంచ్, వీడీసీ వారు కమర్షియల్ కాంప్లెక్స్ కట్టేందుకు గుంతలు తవ్వారని ఆరోపించారు. దీంతో 50 కుటుంబాలకు వెళ్లడానికి దారి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నా.. మొరం కుప్పలు పోస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ, డీపీఓకు వినతిపత్రం ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కృష్ణ దాస్, శోభన్, బండి శేఖర్, నారాయణ దాస్, నర్సయ్య, రామకృష్ణ, లక్ష్మీ, సునీత, రాణి పాల్గొన్నారు.

యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ ఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం తెయూ క్యాంపస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ మాట్లాడారు. తెయూలో జరుగుతున్న వివాదాలను పరిష్కరించాలని, అక్రమ నియామకాలు, పదోన్నతులపై చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీలో అకడమిక్ వాతావరణాన్ని పెంపొందించాలని పీడీఎస్‌యూ ఉద్యమించిందన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఉద్యమాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తెయూ వీసీ రవీందర్‌గుప్తా పై చర్యలు తీసుకోవడం, విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్‌ను బదిలీ చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 2017 నుంచి తెయూలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, అక్రమ నియామకాలు, పదోన్నతులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్, కర్క గణేష్, అనిల్, వినోద్, సందీప్, సాయి, ఆకాష్ పాల్గొన్నారు.

నేటి డిగ్రీ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం (20న) జరగాల్సిన డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1వ, 3వ, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను జూలై 3న నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యాదినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకే పరీక్షలను వాయిదా వేశామన్నారు.

కుంట కబ్జాను అడ్డుకున్న గ్రామస్తులు

మోర్తాడ్: మండలంలోని వడ్యాట్‌లో కోమటికుంటను కబ్జా చేయడానికి హాసకొత్తూర్‌కు చెందిన గడ్డం రాజేశ్వర్ అనే రైతు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సోమవారం వడ్యాట్‌లో ఇంటికి ఒకరు చొప్పున సమావేశమై కమ్మర్‌పల్లి మార్గంలో ఉన్న కోమటికుంట వద్దకు వెళ్లారు. అక్కడ రాత్రిపూట రహస్యంగా రోడ్డును వేయడానికి మొరం పోయించడం, కుంట మధ్యలో నుంచి రోడ్డు కోసం చదను చేయడంను గ్రామస్తులు గుర్తించారు. రోడ్డును ధ్వంసం చేయడంతో పాటు కుంట కబ్జా కోసం చేపట్టిన చర్యలను పూర్తిగా నిలువరించారు. కోమటికుంట పట్టా భూమి అయినప్పటికి పంట భూములకు సాగునీరు అందిస్తోందని గ్రామస్తులు అన్నారు.

ఒకరి బైండోవర్

ఇందల్వాయి: త్రయంబక్‌పేట్‌లో నాటు సారా కాస్తున్న సంత్యాలి అనే మహిళను తహసీల్దార్ రోజ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ కానిస్టేబుల్ మహేష్ తెలిపారు. సంత్యాలి ఇంటిపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతి

కామారెడ్డి టౌన్: తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు కోరారు. సోమవారం వారు సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, వైద్య ఆరోగ్యశాఖ, టీవీవీపీ, డెరెక్టర్ ఆఫ్ హెల్త్ కమీషనర్‌లకు ఫ్యాక్స్, ట్విట్టర్, మెయిల్‌ల ద్వారా విన్నవించుకున్నారు. జిల్లాలో 200 మంది ఎంపీహెచ్ఏ కోర్సు పూర్తి చేసుకుని చాలా ఏళ్లుగా ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. జిల్లాలో వైద్య శాఖలో భారీగా ఖాళీలు ఉన్నాయని తమను ఈ పోస్టుల్లో భర్తీ చేయాలని కోరారు. లింగం, శ్రావణ్ తదితరులున్నారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే, ఎంపీ



వృద్ధుడిని ఆస్పత్రికి పంపుతున్న ఎమ్మెల్యే,



ఘటనా స్థలంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ మండలం అంకాపూర్ శివారులోని 63వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన వృద్ధుడిని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే రాజకీయంగా బద్ధ శత్రువులుగా ఉన్న వీరిద్దరు ప్రమాద స్థలంలో ఎదురుపడటంతో ఒకరినొకరు మాట్లాడించుకోవడం ఆసక్తికరమైన అంశంగా మారింది. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన గాదెపల్లి చిన్నగంగారెడ్డి ద్విచక్ర వాహనంపై ఆర్మూర్ వైపు వెళ్తున్నాడు. సీడ్ కంపెనీ నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో తలకు గాయమైంది. అదే రోడ్డు మార్గంలో పెర్కిట్ నుంచి అంకాపూర్‌కు వస్తున్న ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె గంగారెడ్డి రోడ్డు ప్రమాదం జరిగింది చూసి తమ వాహనాలను ఆపారు. క్షతగాత్రుడిని స్థానికులు పలకరిస్తున్న క్రమంలో మాక్లూర్ అర్బన్ పార్క్‌కు వెళ్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రోడ్డు ప్రమాదాన్ని గమనించి తన కాన్వాయిని ఆపించారు. గన్‌మెన్‌ల సహకారంతో క్షతగాత్రుడిని తన వాహనంలో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఎంపీ అర్వింద్, పల్లె గంగారెడ్డిని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పలకరించారు. ఎంపీ సాబ్ నిజామాబాద్ నుంచి వస్తున్నారా అని ఎమ్మెల్యే అడిగారు. పెర్కిట్‌లోని తన ఇంటి నుంచి అంకాపూర్‌లో చేరికల కార్యక్రమానికి వెళ్తున్నట్లు ఎంపీ సమాధానం ఇచ్చారు.

దివ్యాంగుల బంధు ప్రకటించాలి



బోధన్ ఆర్డీవో ఆఫీసు ఏవోకు వినతి పత్రం అందిస్తున్న దివ్యాంగులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల బంధు పథకం వెంటనే ప్రకటించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో వీహెచ్‌పీఎస్ అధ్వర్యంలో సోమవారం పట్టణంలో అంబేడ్కర్ చౌరస్తాకు సమీపంలో రైల్వేగేట్ వద్ద దివ్యాంగులు రాస్తారోకో చేపట్టారు. తదనంతరం ఆర్డీవో ఆఫీసు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఏవో ముంతాజుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. రాస్తారోకోతో రైల్వేగేట్‌కు ఇరువైపుల వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా అధ్యక్షుడు బీరప్పా, స్వామిదాస్, సలీం, సామేల్ పాల్గొన్నారు.



రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు

'బీసీలతో ఆడుకుంటున్న ప్రభుత్వం'



దరఖాస్తుదారులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: బీసీల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడుకుంటుందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం ఆయన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుదారులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సహాయం పేరుతో మోసం చేస్తున్నారని అన్నారు. గడువు 20వ తేదిన పెట్టి, దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. 15 రోజులుగా సర్టిఫికేట్‌ల కోసం ప్రజలు కార్యాలయం చుట్టు తిరుగుతున్నా ఇవ్వకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో దళారులు, కాంట్రాక్టర్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే లాభపడుతున్నారని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, నాయకులు ఐరెని సందీప్, గణేష్‌నాయక్, చందు, దత్తేశ్వరీ, కారంగుల అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ నాగారం: ఉమ్మడి జిల్లా వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి నగేష్‌గౌడ్, అధ్యక్షుడిగా రవిచరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాయికిరణ్, కోశాధికారిగా ఎ భాస్కర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా అనిల్‌కుమార్, మహిపాల్, సంయుక్త కార్యదర్శులుగా కల్యాణ్, ఆంజనేయులు, ముఖ్య సలహాదారుగా అరవింద్ ఎన్నికయ్యారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ధర్పల్లి: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ధర్పల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బండి పద్మ (40) ఈ నెల 10 న కుటుంబ కలహాలతో ఇంట్లో పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతురాలి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ఔటిగల్లీకి చెందిన మనోజ్(30) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కుటుంబ కలహాలతో మనోజ్ భార్య 15 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆర్మూర్ శివారులోని దర్గా వెనకాల ఉరి వేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



నస్రుల్లాబాద్‌లో స్కూటీని ఢీకొన్న కారు

పొలాల్లోకి దూసుకెళ్లిన బొలెరో



నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్‌లో బోధన్-బాన్సువాడ రహదారిపై సోమవారం స్కూటీని కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నస్రుల్లాబాద్‌కు చెందిన వెంకాగౌడ్- ప్రమీల దంపతులు సరుకులు తీసుకొని స్కూటీపై వెళ్తుండగా బాన్సువాడ నుంచి వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో ప్రమీలకు రెండు కాళ్లు విరగ్గా, వెంకాగౌడ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్‌కు తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి..

పిట్లం: మండలంలోని కారేగాం శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా నాగిల్‌గిద్ద మండలం కరస్ గుత్తి గ్రామానికి చెందిన రమాకాంత్‌కు కాలు విరిగి తీవ్రగాయాలు అయ్యాయి. అతనిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నిజామాబాద్ తరలించారు.

పెద్దకొడప్‌గల్: బాతు గుడ్ల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం టైరు పగిలి అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన సోమవారం పెద్దకొడప్‌గల్ గ్రామ శివారులో జరిగింది. బిచ్కుంద నుంచి బాతు గుడ్ల లోడ్‌తో ఆంధ్రప్రదేశ్‌లో ఏలూరు వెళ్తున్న వాహనం టైరు పగలడంతో పొలాల్లోకి దూసుకెళ్లింది.దీంతో గుడ్లు నేల పాలయ్యాయి. వాహనంలోని డ్రైవర్,క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి..

మోపాల్: మండలంలోని మంచిప్ప సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీష్‌కు సోమవారం జరిగిన ప్రమాదంలో స్వల్పగాయాలు అయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వ్యక్తిగత పనుల నిమిత్తం నిజామాబాద్‌కు వెళ్తుండగా బోర్గాం(పి) మోటాటి రెడ్డి కల్యాణ మండపం వద్ద బైక్ అదుపు తప్పి ఎదురుగా ఉన్న వాహనాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

క్రైం కార్నర్

చెరువులో పడి యువకుడి మృతి

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో ప్రమాదవశాత్తు మునిగిపోయి బర్ల శ్రావణ్ కుమార్ (23) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి శ్రావణ్‌కుమార్ వ్యవసాయ పనులతో పాటు గేదెలు మేపుతుంటాడు. సోమవారం ఉదయం గేదెలు మేపడానికి చెరువు సమీపంలోకి వెళ్లాడు. గేదెలు చెరువులోకి వెళ్తుండటంతో ఒడ్డుకు చేర్చేందుకు చెరువులో దిగాడు. వెళ్లిన ప్రాంతంలో లోతుగా ఉండడంతో అందులో మునిగిపోయాడు. కట్టపైనున్న ఇద్దరు వ్యక్తులు గుర్తించి చెరువులోకి దిగి బయటకు తీసుకొచ్చారు. కానీ అప్పటికే శ్రావణ్‌కుమార్ చనిపోయాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన సాయనోల్ల శ్రీనివాస్ (32) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 17న మండలంలోని గొట్టిముక్కల శివారులో మాధాపూర్‌కు చెందిన ప్రశాంత్ ఎదురుగా వస్తున్న ధర్మోరా గ్రామానికి చెందిన శ్రీనివాస్ బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాస్‌కు బలమైన గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు రుశ్వంత్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మేక ..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేటలో విద్యుత్ షాక్ తగిలి మేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం కాంశెట్టి లక్ష్మయ్యకు చెందిన మేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల తీగలకు తగిలి మృతి చెందింది.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

లింగంపేట: బైక్, సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని బాణాపూర్ తండాకు ప్రతాప్ బైక్, సక్రుకు చెందిన సెల్ ఫోన్ 16న రాత్రి వైద్యనాథ్ విష్ణు అనే వ్యక్తి చోరీ చేశాడు. సెల్‌ఫోను లొకేషన్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతడి నుంచి బైక్, ఫోన్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మహారాష్ట్రకు చెందిన విష్ణు 15 ఏళ్ల క్రితం కామారెడ్డికి వచ్చి, అడ్డ మీది కూలీగా పనిచేస్తున్నాడన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- మహిళ మృతి, మరో ముగ్గురికి గాయాలు

బోధన్‌టౌన్: బోధన్ శివారులోని పసుపు వాగు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గైక్వాడ్ లక్ష్మి(50) మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బోధన్ మండలంలోని భవానిపేట్ గ్రామానికి చెందిన గైక్వాడ్ లక్ష్మి, గైక్వాడ్ ప్రమీల కూరగాయాలు విక్రయించడానికి రోజు మాదిరిగానే బోధన్‌కు ఉదయం 7 గంటలకు వచ్చారు. కూరగాయలు విక్రయించి తిరిగి ఇంటికి వెళ్లడానికి ఆటో ఎక్కారు. వీరితో పాటు రుద్రూర్‌కు చెందిన ఫసిహైమద్, డ్రైవర్ అబ్దుల్ వాజిద్ ఆటోలో ఉన్నారు. వీరి ఆటోను పట్టణ శివారులోని పసుపు వాగు దాటిన అనంతరం ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమీల, ఫసిహైమద్, అబ్దుల్ వాజిద్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కాలనీలో నివాసం ఉండే సింగజోగి చిన్న పోచయ్య కూలీ పని చేస్తాడు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నవాడైన సాయికుమార్(21)కు మతిస్థిమితం లేదు. అతడు ఇదివరకే చాలా సార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి నాలుగైదు రోజులకు తిరిగి వచ్చాడు. ఈ నెల 3 ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు ..

కామారెడ్డిలోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్ఓ నరేష్ సోమవారం తెలిపారు. కాలనీలో నివాసం ఉండే డప్పు గంగవ్వ(80) సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కుమారుడు సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.